క్లుప్తంగా

రేపు సర్వసభ్య సమావేశం

భూపాలపల్లి రూరల్: జంగేడు పీఏసీఎస్ కార్యాలయంలో రైతుభరోసా పథకంపై అభిప్రాయ సేకరణ చేసేందుకు రేపు (సోమవారం) సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు పీఏసీఎస్ అధ్యక్షులు మేకల సంపత్‌కుమార్ యాదవ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆధ్వర్యంలో జులై 1న మధ్యాహ్నం 2:30 గంటలకు రైతుభరోసా విధివిధానాలపై ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సంఘం పాలకవర్గ సభ్యులు, సంఘ సభ్యులు, రైతులు సకాలంలో హాజరై సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

2న పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

కాటారం: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో ఈ నెల 2న చైర్మన్ తోటపల్లి ప్రశాంత్ ఆధ్వర్యంలో సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సీఈఓ ఎడ్ల సతీశ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంఘం లావాదేవీలు, ఖర్చులు, రుణాల మంజూరు, రికవరీ, సంఘం ద్వారా చేపట్టిన కార్యక్రమాలను గూర్చి సమావేశంలో చర్చించడం జరుగుతుందని తెలిపారు. పాలక వర్గం సభ్యులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సన్మానం



మల్హర్: కొడవటంచ ఆలయ కమిటీ చైర్మన్‌గా ఎన్నికై మండలాని వచ్చిన నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ముల్కనూరి భిక్షపతిని మండల నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలోని కొయ్యూరు ప్రెస్‌క్లబ్‌లో భిక్షపతిని శాలువాలతో ఘనంగా సత్కరించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మండపల్లి శ్రీధర్, ఉపాధ్యక్షుడు మండపల్లి సురేష్, కోశాధికారి సుధాకర్, మండల కోశాధికారి కొండయ్య, రఘు, సమ్మయ్య, రాజు, రమేష్, దేవేందర్, అంజి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



మొగుళ్లపల్లి: మండలంలోని బంగ్లాపల్లి గ్రామానికి చెందిన గోనెల అశోక్ కుమార్తె వర్ష, అనుముల మోహన్‌రెడ్డి వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే సత్యనారాయణరావు శనివారం పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవాలి

మొగుళ్లపల్లి: కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సునీత తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం ద్వారా మండల ప్రజలు ఎలాంటి సమస్యలున్నా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అభివృద్ధికి నిధులివ్వాలి

కన్నాయిగూడెం: జిల్లాలోనే వెనుకబడిన మండలమైన కన్నాయిగూడెం మండల అభివృద్ధికి నిధులు ఇవ్వాలని కాంగ్రెస్ మండల ఇన్‌చార్జ్ జాడి రాంబాబు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. జిల్లాలోనే వెనుకబడిన మండలం కావడంతో అభివృద్ధికి తోడ్పడాలని వినతి ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఆయన వెంట మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు తాటి రాజబాబుతో పాటు తదితరులు ఉన్నారు

నియామకం

ములుగు/ఏటూరునాగారం: జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్సీ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య ఆదేశాలు మేరకు ఏటూరునాగారం మండలశాఖ అధ్యక్షుడిగా గంపల శివకుమార్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు పెట్టెం రాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పేద ప్రజల సమస్యల పరిష్కారం ధ్యేయంగా అవినీతి అక్రమాలకు తావులేని సమాజం కోసం రాష్ట్ర, జిల్లా కమిటీల ఆదేశాల మేరకు పనిచేయాలని రాజు సూచించారు. ఈ సందర్భంగా ఏటూరునాగారం మండల అధ్యక్షుడిగా నియమితులైన గంపల శివకుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి కట్టబెట్టిన రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో అన్ని గ్రామ కమిటీలను త్వరలో పూర్తిచేస్తానని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటానని తెలిపారు.

పూట గడిచేదెట్లా..?

- నెలల తరబడి కార్మికులకు రాని వేతనాలు
- ఇబ్బంది పడుతున్న పారిశుద్ధ్య సిబ్బంది



ఏలేటిరామయ్యపల్లిలో చెత్తను ఎత్తిపోస్తున్న జీపీ సిబ్బంది

చిట్యాల: గ్రామాల్లో అన్ని రకాల వసతులు కల్పించడమే కాకుండా గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దే కార్మికులకు సకాలంలో వేతనాలు రాక.. పూటగడిసే పరిస్థితి లేదు. తెల్లవారితే ఇంటి నుంచి లేచి గ్రామాలను పరిశుభ్రంగా ఉండే విధంగా మురుగు కాల్వలతో పాటు చెత్త చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారు. గ్రామంలో ఏ సమస్య వచ్చిన గ్రామ పంచాయతీలో పని చేసే పారిశుద్ధ్య సిబ్బందే కీలకం. కాని మండలంలోని పారిశుద్ధ్య కార్మికులకు కొన్ని గ్రామాలలో నెలల తరబడి జీతాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. దూత్‌పల్లి, గుంటురుపల్లి, కాల్వపల్లి, సీఆర్‌పల్లి, లక్ష్మీపూర్‌తండా, వరికోల్‌పల్లి, ఒడితల, ఏలేటిరామయ్యపల్లి గ్రామాల్లో పని చేస్తున్న కార్మికులకు దాదాపు పది నెలలుగా వేతనాలు రాకపోవడంతో అనేక అవస్థలు పడుతున్నామని కార్మికులు వాపోతున్నారు. ఏ అధికారికి చేప్పుకోవాలో తెలియని దుస్థితితో వారు ఉన్నారు. పని చేస్తేనే పూట గడిసే రోజుల్లో ఇలాంటి పరిస్థితి వెంటడడం ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాలు రాకపోతే తమ కుటుంబాలను ఏలా బతికించుకోవాలని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమకు సకాలంలో వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని పారిశుద్ధ్య కార్మికులు కోరుతున్నారు.

జీవితాన్ని నాశనం చేసుకోవద్దు



యువకులతో మాట్లాడుతున్న ఎస్సై

మహాముత్తారం: చదువుకునే వయస్సులో యువత చెడు వ్యసనాలకు అలవాటుపడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఎస్సై మహేందర్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన యువతకు పోలీస్ స్టేషన్‌లో శనివారం ఎస్సై కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులు ఫ్రెండ్లీగా ఉంటున్నారనే ఉద్దేశంతో కొంత మంది యువత అసాంఘిక కార్యాక్రమాలకు పాల్పడుతున్నారని అన్నారు. అలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు ఎవరూ పాల్పడిన కఠిన చర్యలు తీసుకోవాడానికి వెనకాడబోమన్నారు. మారుమూల ప్రాంతాల్లో సైతం పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు.

ఎస్సైని కలిసిన నాయకులు



ఎస్సైని సన్మానిస్తున్న నాయకులు

వాజేడు: వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ బాధ్యతలు చేపట్టడంతో కాంగ్రెస్ నాయకులు శనివారం మార్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సైని శాలువతో సన్మానించారు. నాయకులు దంతులూరి విశ్వనాథ ప్రసాద్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్, మాజీ మండల అధ్యక్షుడు దాట్ల వాసు, సొసైటీ ఉపాధ్యక్షుడు జగన్నాథరాజు, మాజీ సర్పంచ్ తల్లడి ఆదినారాయణ, మైనారిటీ నాయకులు ఖాజావళి, బిజ్జి బాబు ఉన్నారు.

ప్రజలు కలిసిమెలిసి ఉండాలి



మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి

మొగుళ్లపల్లి: ప్రజలు కలిసిమెలిసి ఉండాలని ఆర్‌ఐ సురేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అంకుషాపూర్ గ్రామంలో అంటరానితనం, అత్యాచారాలపై పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించి గ్రామస్తులకు చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కులాలలకు, మతాలకు అతీతంగా జీవించాలని అన్నారు. కులాల పేరుతో ఎవరిని కించపర్చకూడదని అలా చేస్తే వారిపై చట్ట ప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు. రాజ్యాంగం హక్కులతో పాటు బాధ్యతలు కూడా ఇచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలకు లోబడి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎమ్‌డీ హుస్సేన్, రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం బస్టాండ్ వద్ద భార్యభర్తలు గొడవపడి పురుగుల మందుతాగి భర్త శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. పలిమెల మండలం పంకెనకు చెందిన సోన్నారి రాజయ్య, భార్య సరితలు తరుచు గొడవలు పడుతున్నారు. దీంతో భార్య తల్లిగారి ఇంటికి మంచిర్యాల జిల్లా కోటపల్లికి వెళ్లడానికి వచ్చి కాళేశ్వరంలో శుక్రవారం బస్సు దిగారు. భర్త మద్యం తాగి భార్యను కొట్టడంతో 100కు డయల్ కాల్ రావడంతో ఇద్దరిని కాళేశ్వరం పోలీసులు స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఇద్దరికి నచ్చచెప్పి పంపారు. మధ్యాహ్నం మళ్లీ కాళేశ్వరంలో గొడవ జరుగగా భర్త బస్టాండ్ సమీపంలో పురుగుల మందు తాగినట్లు తెలుపడంతో 108కు స్థానికులు ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో వచ్చి తీసుకువెళ్లారు. మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యసేవలందింస్తున్నారు. ఈ విషయమై కాళేశ్వరం ఎస్సై చక్రపాణిని సంప్రదించగా 100కు కాల్ రావడంతో వారిద్దరికి కౌన్సెలింగ్ ఇచ్చి తిరిగి ఇంటికి పంపించినట్లు తెలిపారు.

డీఈఓ కార్యాలయ ఏడీ రాంకుమార్‌కు సన్మానం



ఏడీని సన్మానిస్తున్న ఉద్యోగులు

విద్యారణ్యపురి: హనుమకొండలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తూ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా డీఈఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న రాంకుమార్ ఈనెల 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈక్రమంలో హనుమకొండ డీఈఓ కార్యాలయంలో ఆయనను ఉద్యోగులు శనివారం సన్మానించారు. డీఈఓ ఎండీ.అబ్దుల్‌హై ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏసీజీఈ చలపతిరావు, ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ శంకర్‌రావు, టీఎస్‌జీఓఎస్ ఎడ్యుకేషన్ జిల్లా అధ్యక్షుడు కలకోట్ల భరత్ సుధాకర్, రవిబాబు, అలీం, జాకీర్, జయధీర్, ఆదిత్య, బండి శ్రీను, ఉద్యోగులు పాల్గొన్నారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కేంద్రంలో మతిస్థిమితం లేని వృద్ధుడు చెరువులో పడి శనివారం మృతి చెందాడు. ఎస్సై పవన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పెంట రామన్న(75) మతిస్థిమితం లేక ఈనెల 28న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. మండల కేంద్రానికి చెందిన వ్యక్తి జాడీ రాజేందర్ కొత్తచెరువు వద్దకు వెళ్లి చూడగా రామన్నకు చెందిన చెప్పులు కనిపించాయి. అతను కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. చెరువులో రామన్న మృతదేహం లభించింది. మృతుడి కుమారుడు పెంట స్వామి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దు



మాట్లాడుతున్న పస్రా ఎస్సై కమలాకర్

గోవిందరావుపేట: అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దని పస్రా ఎస్సై కమలాకర్ అన్నారు. పస్రా పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవునిగుట్ట గుత్తికోయగూడెంను శనివారం ఎస్సై సిబ్బందితో సందర్శించారు. ఈ సందర్భంగా గొత్తికోయగూడెం ప్రజలతో మాట్లాడుతూ.. ఎవరైనా కొత్త వ్యక్తులు గ్రామానికి వస్తే తమకు సమాచారం అందించాలని అన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. దేవునిగుట్ట గొత్తికోయగూడెం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న వానాకాలం దృష్ట్య వరదలు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

జిల్లా స్థాయి ఎంపికలు పూర్తి

ములుగు రూరల్: తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలల్లో 4వ తరగతి ప్రవేశాల కోసం ఈ నెల 28, 29న మండలంలోని జాకారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఎంపిక కార్యక్రమం నిర్వహించామని జిల్లా యువజన, క్రీడల ఇన్‌చార్జ్ అధికారి తుల రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హకీంపేట, ఆదిలాబాద్, కరీంనగర్ పాఠశాలల్లో ప్రవేశం కోసం మండల స్థాయి, జిల్లా స్థాయి ఎంపిక కార్యక్రమాలు పూర్తయ్యాయని అన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు 07న హైదరాబాద్‌లో ఎంపిక నిర్వహించి సీట్లు కేటాయిస్తారని అన్నారు. ఎంపికైన విద్యార్థులు హకీంపేట్ గురుకుల పాఠశాలలో 07న రిపోర్టు చేయాలని అన్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వెంకటాపురం(కె): పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం జిల్లా జనరల్ సెక్రెటరి రామ్మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో రిటైర్డు ఉద్యోగుల జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను చెల్లించడంతో పాటు నగదు రహిత వైద్య సదుపాయం కల్పించాలని అన్నారు. సంఘం అభివృద్ధి కోసం అందరు సమష్టిగా కృషి చేయాలని అన్నారు. పలు కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సారయ్య, నాయకులు దామోదర్‌రెడ్డి, చంద్రశేఖర్, విజయలక్ష్మి, బిఆర్ భూషణం, కాల్వ సుందర్రావ్ తదితరులు ఉన్నారు.

జగదీశ్‌కు ఘన నివాళి

ములుగు రూరల్: దివంగత మాజీ జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్ ప్రథమ వర్ధంతిని బీఆర్ఎస్ పార్టీ నాయకులు శనివారం నిర్వహించారు. మండలంలోని మల్లంపల్లి జగదీశ్ స్వగృహంలో వర్ధంతి నిర్వహించగా పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకుల మర్రి లక్ష్మణ్‌బాబు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి హాజరై ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగదీశ్ కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు. నాయకులు కుడుముల లక్ష్మీనారాయణ, మల్లారెడ్డి, శ్రీధర్, రాజుయాదవ్, బాదం ప్రవీన్, సమ్మయ్య పాల్గొన్నారు.

గోవిందరావుపేట: తెలంగాణ ఉద్యమ కారుడు, మాజీ జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్ ప్రథమ వర్ధంతిని శనివారం మండల కేంద్రంలో, పలు గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు నిర్వహించారు. ఎంపీపీ సూడి శ్రీనివాస్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు లకావత్ నరసింహ నాయక్, చల్వాయి గ్రామ కమిటీ అధ్యక్షుడు నాం పూర్ణచందర్ తదితరులు జగదీశ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పిన్నింటి మధుసూదన్ రెడ్డి, అక్కినపల్లి రమేశ్, ఎండి.బాబర్, పృథ్వీరాజ్, హేమాద్రి, వాగ, బూరెడ్డి మధు, ఉట్ల మోహన్, బైకాని ఓదేలు, రమేష్, బత్తుల రాణి, దర్శనాల సంజీవ్, కొంపెల్లి కృష్ణారెడ్డి, సత్తు భద్రయ్య, కుమార్, బొడిగె రఘు, గోద కనకయ్య, కుమ్మరి వెంకన్న, శ్యామ్ ఉన్నారు.

రామప్పను సందర్శించిన శ్రీలంక జర్నలిస్టులు



వెంకటాపురం(ఎం): మండలంలోని చారిత్రాత్మక రామప్ప దేవాలయాన్ని శ్రీలంకకు చెందిన 30మంది సందర్శించారు. హైదారాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న శ్రీలంకకు చెందిన జర్నలిస్టులు శిక్షణలో భాగంగా రామప్ప ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. రామప్ప ఆలయ పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్‌లు వారికి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. రామప్ప ఆలయ విశిష్టత గురించి గైడ్ గోరంట్ల విజయ్‌కుమార్ వివరించగా.. రామప్ప టెంపుల్ బ్యూటిఫుల్ అంటూ కొనియాడారు. అనంతరం రామప్ప సరస్సును సందర్శించారు. వారి వెంట ఎంసీహెచ్ఆర్డీ అధికారులు సురేష్, రవి, టూరిజం అధికారులు ఉన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు



సమావేశంలో పాల్గొన్న అధికారులు

భూపాలపల్లి రూరల్: గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా జిల్లావ్యాప్తంగా నిత్యం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ కళ్లెపు శోభ అధికారులను ఆదేశించారు. శనివారం జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి అధ్యక్షతన స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా శోభ పలు శాఖల అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎక్సైజ్ శాఖతో పాటు పలు శాఖల అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ సభ్యులు అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా కళ్లెపు శోభ మాట్లాడుతూ రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో పరీక్ష ఫీజులు నియంత్రించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోత్కు ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. జిలా కేంద్రంలోని కొమురయ్య భవన్‌లో శనివారం ఏఐఎస్ఎఫ్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేయగా ప్రవీణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఈ సంవత్సరం ఒక్కొక్క తరగతికి రూ.4వేలు వరకు ఫీజులను పెంచారన్నారు. పేరెంట్స్ కమిటీ తీర్మానం లేకుండా, విద్యాశాఖ అధికారులకు తెలియకుండా విచ్చలవిడిగా ఎల్‌కేజీ నుంచి పదవ తరగతి వరకు ఫీజులను పెంచడం జరిగిందన్నారు. కలెక్టర్, విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి పాఠశాలలో బుక్స్ అమ్మడం జరుగుతుందని, రూ.వెయ్యికి అందుబాటులో దొరికే పుస్తకాలకు రూ.ఎనిమిది వేలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. వెంటనే జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్, నాయకులు మాతంగి దిలీప్, ఇందరపు అరవింద్, కల్యాణ్ రక్షిత, స్వరూప పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల: విద్యార్థుల భవిష్యత్‌కు ఉపాధ్యాయులే కీలకం అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం మండలంలోని జడలపేట శివారు భీష్మనగర్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న న్యాసాని మనోహారావు ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దే గొప్ప వ్యక్తులు ఒక్క ఉపాధ్యాయులేనని అన్నారు. మనోహార్‌రావు 26 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో అంకిత భావంతో పాటు వృత్తిపై గౌరవంతో పని చేశారని పేర్కొన్నారు. అలాగే పీఆర్‌టీయూ సంఘంలో మనోహారావు చురుకైన పాత్ర పోషించాడని తెలిపారు. అనంతరం ప్రధానోపాధ్యాయుల కుటుంబ సభ్యులకు శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రేగూరి సుభాకర్‌రెడ్డి, కుసునపు కిరణ్‌కుమార్, టేకుమట్ల జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఊర్మిళ, మొగుళ్లపల్లి ప్రధానోపాధ్యాయులు విజయపాల్ రెడ్డి, ఉపాధ్యాయురాలు మంజుల, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాబోధన మెరుగుపర్చడానికి శిక్షణ



శిక్షణలో పాల్గొన్న సీడీపీఓ రాధిక, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు

కాటారం: నూతన విద్యావిధానానికి అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మరింత అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయడం కోసం మూడు రోజుల పాటు టీచర్లకు శిక్షణ అందజేసినట్లు సీడీపీఓ రాధిక తెలిపారు. మండలంలోని దేవరాంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లకు మాస్టర్ ట్రైనర్స్ మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. శిక్షణా కార్యమ్రంలో టీచర్లకు పలు టీచింగ్ విధానాలపై అవగాహన కల్పించారు. చిన్నారులకు ప్రీ స్కూల్‌లో నేర్పించాల్సిన ఆట, పాటలు, కథలు, డేవైస్ ఆక్టివిటీస్ గూర్చి వివరించారు. కార్నర్ ఏర్పాటు చేసి తరగతి నిర్వహణ, సెలబస్ ప్రకారం కథలు, పాటలు, సృజనాత్మకత, వివిధ అంశాలపై టీచర్లతో గ్రూప్స్ ఆక్టివిటీస్, చార్ట్స్ తయారు చేయించి ప్రదర్శన ఇచ్చినట్లు తెలిపారు. టీచర్లలో బోధన నైపుణ్యాలు మెరుగుపర్చడానికి ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని సీడీపీఓ పేర్కొన్నారు. సూపర్‌వైజర్లు సరస్వతి, వీణ, భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని మేడారం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ఆవరణలో శనివారం ఎన్‌డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో వరదలు, తుపాన్ సంబంభవించినప్పుడు ప్రజా రక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రతలపై విద్యార్థులు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా డీఎంహెచ్ఓ, మండల స్పెషలాఫీసర్ అల్లెం అప్పయ్య హాజరయ్యారు. ఈసందర్భంగా ఎన్‌డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ భూపాల్‌కుమార్ మాట్లాడుతూ.. వర్షకాలంలో తుపాన్ వచ్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించారు. పకృతి వైపరీత్యాలు సంబంభవించినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పకృతి విపత్తు సమయంలో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రతల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తోట రవీందర్, ఎంపీడీఓ సుమనవాణి, ఎంపీఓ శ్రీధర్, పాఠశాల హెచ్‌ఎం సరోజన, ఫైర్ కానిస్టేబుల్ రవికుమార్, ఆర్ఐ రాజు, పంచాయతీ కార్యదర్శి కొర్నెబెల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.